సాక్షి విశాఖపట్నం


సోమవారం । 17 । మార్చి । 2025



ఏపీయూఎస్ జిల్లా కార్యదర్శిగా విశ్వనాథం 8లో



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి 8లో



ఇఫ్తార్ సోమ 6.09 | సహర్ మంగళ 4.50

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శం



అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్

మహారాణిపేట : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రాణాలను కూడా పణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన జీవితం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో భవానీశంకర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఈవో) కె.ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మధ్యాహ్నం 12 గంటల నుంచి దర్శనాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనాలు కల్పిస్తామని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి, కోయల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేసి, అనంతరం యథావిధిగా సర్వదర్శనాలు కొనసాగిస్తామన్నారు.

పది ఓపెన్ పరీక్షలకు 19 మంది ఖైదీలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో 19 మంది ఖైదీలు పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీల కోసం ప్రత్యేకంగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఖైదీలకు బుధవారం నుంచి పరీక్షలు జరుగుతాయని జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఈ పరీక్షల కోసం 21 మంది ఖైదీలు దరఖాస్తులు చేసుకున్నారని, ఇద్దరు ఇటీవల జైల్ నుంచి రిలీవ్ కావడంతో మిగిలిన 19 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు కూడా 11 మంది ఖైదీలు రాసినట్లు తెలిపారు.

ఖైదీకి ఫోన్ ఇచ్చిన భార్యాభర్తల అరెస్టు

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఫోన్ ఇచ్చిన భార్యాభర్తలను ఆదివారం అరెస్టు చేశారు. ఇటీవల జైలులో ఖైదీల వద్ద ఫోన్లు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రభుత్వం విచారణ కమిటీ వేయగా జైలులో ఫార్మసిస్టుగా పనిచేసిన కడియం శ్రీనివాసరావు, అతని భార్య పుష్పలతలు నాగమల్లేశ్వరరావు అనే ముద్దాయికి ఫోన్ ఇచ్చినట్లు విచారణలో తేలింది. దీంతో విచారణ అధికారి, ఎస్ఐ కృష్ణ వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో శ్రీనివాసరావు ఖైదీలకు గంజాయి సరఫరా చేయడంతో విధుల నుంచి తొలగించారు. ఖైదీలకు ఫోన్ అందించే ఘటనలో కూడా శ్రీనివాసరావు నిందితుడిగా నిర్ధారణ కావడం చర్చనీయాంశమైంది.

లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

విశాఖ విద్య: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో పి.గోపాలనాయుడు ఎన్నికల అధికారిగా కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఆర్.పి.నాయుడు(వీఎస్ కృష్ణా కాలేజీ), ఉపాధ్యక్షురాలుగా ఎ.శ్రీదేవి(పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా బి.మాధవరావు(భీమునిపట్నం)జాయింట్ సెక్రటరీగా పి.సుమతి(ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీ విశాఖ), కోశాధికారిగా పి.హేమంత్ కుమార్(కృష్ణా కాలేజీ), మహిళా కార్యదర్శిగా ఎల్.ఉమామహేశ్వరి (పెందుర్తి), రాష్ట్ర కౌన్సిలర్‌గా పీఎంకేఎం నాయుడు(కృష్ణా కాలేజీ)లను ఎన్నుకున్నారు. మూడేళ్లపాటు నూతన కమిటీ పనిచేయనుందని ఎన్నికల అధికారి ప్రకటించారు.

విజయోస్తు



నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

హాజరుకానున్న విద్యార్థులు	29,927
రెగ్యులర్	28,523
ప్రైవేటు	1,404
బాలురు	15,094
బాలికలు	13,429

జిల్లాలో పరీక్ష కేంద్రాలు	134
ఏ కేటగిరీ కేంద్రాలు	48
బీ కేటగిరీ కేంద్రాలు	71
సీ కేటగిరీ కేంద్రాలు	9
సమస్యాత్మక కేంద్రాలు	6
చీఫ్ సూపరింటెండెంట్లు	134
డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు	134
రూట్ ఆఫీసర్లు	14
అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు	14

పరీక్షలు ఎప్పటివరకంటే : సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ

పరీక్ష సమయం : ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటలు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నేటి నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 448 పాఠశాలల నుంచి 28,523 మంది విద్యార్థులు రెగ్యులర్‌గా, మరో 1,404 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం జిల్లాలో 134 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 134 మంది సీఎస్‌లు, 134 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 14 మంది రూట్ ఆఫీసర్లు, మరో 14 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను పరీక్షల పర్యవేక్షణ నిమిత్తం కేటాయించారు. ప్రతీ కేంద్రంలో సరిపడా ఇన్విజిలేషన్ సిబ్బందిని నియమించారు. అవసరమైన పక్షంలో వినియోగించుకునేలా అనకాపల్లి జిల్లా నుంచి 240 మంది ఉపాధ్యాయులను రిజర్వ్‌లో ఉంచారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కేంద్రాలను తనిఖీ చేసేలా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. గోపాలపట్నం బాలుర, బాలికల హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు డి.దేవానందరెడ్డి జిల్లా విద్యాశాఖాధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ పర్యటనలో పాల్గొన్నారు.



గోపాలపట్నం స్కూల్లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు దేవానందరెడ్డి

ఓపెన్ పరీక్షలకు 938 మంది విద్యార్థులు

సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్) ఆధ్వర్యంలోని పదో తరగతి పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 938 మంది పరీక్షలకు హాజరుకానుండగా, ఇందుకోసం 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రానికి వంద మీటర్లు పరిధిలో ఉన్న జెరాక్స్ కేంద్రాలను మూసివేసేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ఇన్విజిలేషన్ సిబ్బంది, ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కూడా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావడానికి వీల్లేదు.

పరీక్ష కేంద్రాలకు సంబంధించిన సూచనలు

- విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.
- పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్షా కేంద్రం నుంచి బయటికి వెళ్లడానికి అనుమతి లేదు.
- సున్నితమైన పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడింది.
- హాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకురావద్దు.

విద్యార్థులకు సూచనలు

- హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలి.
- సెల్‌ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్ డివైజులు, స్మార్ట్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు.
- హాల్‌టికెట్ చూపించి విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు.
- ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రంలో తాగునీరు, నిరంతర విద్యుత్, ఫ్యాన్లు ఉండేలా చర్యలు చేపట్టారు.
- ప్రతీ కేంద్రంలో ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎం అందుబాటులో ఉంటారు.

నేడు విశాఖకు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు

రేపటి నుంచి ప్రాక్టీస్



విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అక్షర్ పటేల్ తన జట్టుతో కలిసి సోమవారం విశాఖపట్నం చేరుకోనున్నారు. విశాఖలోని వైఎస్సార్ స్టేడియాన్ని తమ రెండో హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న డీసీ ఈ సీజన్‌ను ఇక్కడే ప్రారంభించనుంది. చాంపియన్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్ జట్టులోని డీసీ సభ్యులంతా వారి ఇంటి నుంచి నేరుగా విశాఖ చేరుకుంటారు. మంగళవారం నుంచి వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటారు. గతంలో పంజాబ్ తరఫున ఆడిన అక్షర్ 2016లో హ్యాట్రిక్ సాధించాడు. 2020లో రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సారి ట్రోఫీ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. విశాఖలో జరిగే తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్(ఎల్ఎస్‌జీ)తో తలపడనుంది. హెడ్ కోచ్ హేమంగ్ బదాని, సహాయ కోచ్ మాథ్యూ, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ పర్యవేక్షణలో అక్షర్ పటేల్, ఇతర ఆటగాళ్లు మంగళవారం నుంచి నెట్స్‌లో సాధన చేస్తారు. జట్టులో స్టార్క్, చమీరా వంటి విదేశీ బౌలర్లు, డ్యూ, బ్రూక్ వంటి బ్యాటర్లు, కేఎల్ రాహుల్, ఫెరీరా వంటి వికెట్ కీపర్లు ఉన్నారు. దేశవాళీ క్రికెట్‌లో సెంచరీలతో చెలరేగిపోయిన కరుణ్ నాయర్‌తో పాటు పోరెల్, స్టబ్స్, అశుతోష్, కుల్దీప్ కూడా ప్రాక్టీస్‌లో పాల్గొంటారు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ తన జట్టుతో ఈ నెల 22న విశాఖ చేరుకోనున్నారు. గత సీజన్‌లో రిషబ్ డీసీకి కెప్టెన్‌గా ఉన్నారు. ఎల్ఎస్‌జీ 23న నెట్స్‌లో ప్రాక్టీస్ చేయనుంది. డీసీ, ఎల్ఎస్‌జీ మధ్య తొలి మ్యాచ్ ఈ నెల 24న విశాఖలో జరగనుంది.

తీరం కోతకు డ్రెడ్జింగ్ పూత

- పనులు ప్రారంభించిన డీసీఐ
- రూ.20 కోట్లు ఖర్చు



సాక్షి, విశాఖపట్నం: అలలు ఎగసిపడి తీరంపై దాడి చేయడం ప్రకృతి సహజం. ఈ దాడి కారణంగా తీరం క్రమంగా కోతకు గురవుతోంది. ఈ కోత తీవ్రం కావడంతో బీచ్ తన సహజ రూపాన్ని కోల్పోతోంది. ఈ నష్టాన్ని నివారించడానికి విశాఖ పోర్టు ఏటా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సహాయంతో ఈ ఏడాది కూడా సుమారు రూ.20 కోట్లతో కోత నివారణ పనులు చేపట్టింది. కాగా.. విశాఖ తీరంలో ఇసుక కోతకు సంబంధించి పదేళ్ల కిందట నెదర్లాండ్‌కు చెందిన డెల్టారిస్ అనే సంస్థ సర్వే చేసింది. అలల తాకిడి కారణంగా పెద్ద మొత్తంలో ఇసుక సముద్రంలోకి వెళ్లిపోతోందని గుర్తించింది. ఈ సమస్యకు ఇసుక మేటలను తిరిగి తీరానికి తరలించడం ఒక్కటే పరిష్కారమని సూచించింది. తీరం కోతకు గురవుతున్న విషయంపై ఆందోళన వ్యక్తం చేసిన విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) దాని నివారణ బాధ్యతను తన భుజానికెత్తుకుంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) జరిగిన నేపథ్యంలో 2016లో కోత నివారణకు ఆగమేఘాలపై ఏర్పాట్లు చేసింది.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహాయంతో 4.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీరానికి తీసుకొచ్చి.. కోత నివారణకు చర్యలు తీసుకుంది. ఏటా మాదిరిగానే ఈ సారి డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.6 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వీపీఏ ఖర్చు చేస్తోంది. ఈ ఏడాది 2.1 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున మొత్తం 6.3 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను డీసీఐ డ్రెడ్జర్ ద్వారా తోడనుంది.

ఎట్టకేలకు కదలిక.!

- ఆరు లేన్ల రహదారి నిర్మాణ పనులు మరూ..
- షీలానగర్ నుంచి సబ్బవరం వరకు 12.66 కి.మీ మేర రహదారి
- 2023లో రూ.554.64 కోట్లతో వర్క్ ఆర్డర్
- ప్రస్తుతం రూ.963 కోట్లకు చేరుకున్న ప్రాజెక్టు వ్యయం



ఆరులైన్ల రహదారి రాబోతున్న ప్రాంతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు రోడ్డును కలుపుతూ షీలానగర్ జంక్షన్ నుంచి సబ్బవరం వరకూ ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. కొన్నేళ్ల క్రితం నుంచి ఈ ప్రాజెక్టు పలుమార్లు తెరపైకి వచ్చింది. ఎట్టకేలకు 2023లో ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచి ఖరారు చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో రూ.554.64 కోట్లతో పనులు ప్రారంభించేందుకు సన్నద్ధమయ్యారు. అయితే రహదారి నిర్మాణానికి సంబంధించిన డిజైన్లు, మ్యాపింగ్ ఆలస్యమవ్వడం .. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో.. ప్రాజెక్టు వర్క్ ఆర్డర్లు అందించే దశలోనే నిలిచిపోయింది. రెండేళ్ల తర్వాత ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధమైంది.

ట్రాఫిక్ అంతరాయాలు తొలగించేలా..

అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి–16 కారిడార్, ఎన్‌హెచ్–516సీ లోని షీలానగర్ జంక్షన్ మధ్య కనెక్టివిటీని పెంచడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. 12.66 కి.మీ విస్తీర్ణంలో ఉన్న ఈ హైవే సబ్బవరం గ్రామంలోని తూర్పు వైపున ప్రారంభమై, ప్రస్తుత పోర్ట్ రోడ్డులోని షీలానగర్ జంక్షన్‌లోని గెయిల్ కార్యాలయం సమీపం వరకూ 6 లైన్ల రహదారిగా రూపుదిద్దుకోనుంది. షీలానగర్ జంక్షన్ నుంచి పెదగాడి, నరవ, జెర్రిపోతులపాలెం, చింతగట్ల మీదుగా సబ్బవరం సమీపంలో జాతీయ రహదారికి ఈ రోడ్డు అనుసంధానం కానుంది. రెండు టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

రూ.400 కోట్ల అదనపు వ్యయంతో..

2023లో వర్క్ ఆర్డర్ ఇచ్చిన సమయంలో రూ.554.64 కోట్లకు ప్రాజెక్టు ఖరీదుగా నిర్ణయించారు. అయితే డిజైన్లలో మార్పులు, ఆర్వోబీలు, ఫ్లైఓవర్ల నిర్మాణం అదనంగా కొన్ని చోట్ల చేర్చి తుది డీపీఆర్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు వ్యయం రూ.963.93 కోట్లకు చేరుకుంది. విశాఖపట్నం జిల్లాలో ఆరు లేన్ల యాక్సెస్–కంట్రోల్డ్ హైవే నిర్మాణం కోసం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రూ.963.93 కోట్లు మంజూరు చేసింది.

ఈ కారిడార్ ఏర్పాటైతే విశాఖ నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. అదేవిధంగా షీలానగర్–ఆనందపురం ట్రాఫిక్‌ను సమర్థవంతంగా విభజించవచ్చు. దీని వల్ల సరకు రవాణా సులువవుతుంది. విశాఖపట్నం పోర్ట్‌కు కనెక్టివిటీ గణనీయంగా పెరిగి.. పోర్టు లాజిస్టికల్ సామర్థ్యం మెరుగుపడుతుందని విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) అధికారులు చెబుతున్నారు. రెండుమూడేళ్లలో ఈ ఆరులైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు వెల్లడించారు.

ఆచార్య.. ఫలితాలెప్పుడు?

- ఏయూ రంగస్థల విభాగంలో వింత పోకడలు
- పరీక్షలు పూర్తయి ఐదు నెలలైనా ఫలితాల విడుదలలో జాప్యం
- తెర వెనుక వివాదాలే కారణమా?

విశాఖ విద్య: యూనివర్సిటీల్లో పరీక్షలు పూర్తయిన రెండు నెలల్లో ఫలితాలు ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ ఆంధ్ర యూనివర్సిటీలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. పరీక్షల విభాగంపై వర్సిటీ పాలనాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని విద్యార్థులు అంటున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న రంగస్థల విభాగం (థియేటర్ ఆర్ట్స్) పరీక్ష ఫలితాల్లో మితిమీరిన జాప్యం నెలకొంది. ఇక్కడ పని చేస్తున్న ఇద్దరు కాంట్రాక్ట్ ఆచార్యుల మధ్య నెలకొన్న మనస్పర్థలతో ఆ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ప్రచారం ఉంది. గతేడాది నవంబర్‌లో జరిగిన డిప్లమో యాక్టింగ్, డైరెక్షన్ ఆఖరి ఏడాది పరీక్ష ఫలితాలు మార్చి గడుస్తున్నా ఇంకా ప్రకటించలేదు. విద్యార్థులు రాసిన జవాబుపత్రాలు రంగస్థల విభాగానికి ఎప్పుడో చేరినా.. వాటిని మూల్యాంకనం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

'రంగస్థలం'కు పునరుజ్జీవం

ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాటకరంగానికి పుట్టినిల్లుగానే చెబుతారు. అందుకనే ఆంధ్ర యూనివర్సిటీలో నటన, దర్శకత్వం కోర్సుల నిర్వహణకు ప్రత్యేకంగా థియేటర్ ఆర్ట్స్ విభాగం ఏర్పాటు చేశారు.



సాయంత్రం వేళ నిర్వహించే నటన, దర్శకత్వంలో ఒక్కో కోర్సులో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయితే రెండేళ్లుగా అడ్మిషన్లు చేపట్టలేదు. దీనికి పునరుజ్జీవం పోసేలా విభాగాధిపతి నరసింహారావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఈ విద్యా సంవత్సరంలో మళ్లీ కోర్సుల నిర్వహణ ప్రారంభమైంది. రంగస్థల విభాగం ప్రాధాన్యం దృష్ట్యా కోర్సుల నిర్వహణకు ఎటువంటి ఆటంకం లేకుండా అవసరమైన నిధులు సైతం కేటాయిస్తున్నారు. రెగ్యులర్ పోస్టుల భర్తీ లేకపోవడంతో ఇద్దరు కాంట్రాక్టు ఆచార్యులు, మిగతా అన్ని సబ్జెక్టులకు సరిపడే గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించారు.

ఆచార్యుల తీరు మారాల్సిందే..

రంగస్థల విభాగంలో అత్యధిక మార్కులతో ప్రతిభ సాధించిన విద్యార్థులకు స్నాతకోత్సవంలో బంగారు పతకాలు బహూకరిస్తారు. వీటిని ఎవరికి ఇవ్వాలనేది ఆచార్యులకే సర్వాధికారాలు ఉంటాయి. విద్యార్థుల్లో నటన, సృజనాత్మక ప్రతిభను అంచనా వేయడం చాలా అవసరం. వాటిని బట్టి అంతర్గత, ప్రయోగ సామర్థ్యాలకు మార్కులు వేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బంగారు పతకం మీకే ఇస్తామంటూ విద్యార్థులతో ఇక్కడి ఆచార్యులు బేరసారాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిణామాలతోనే గతంలో ఒక అధ్యాపకుడు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడి రంగస్థల విభాగానికి మచ్చ తెచ్చిపెట్టారు. అయినా ఇక్కడి ఆచార్యుల్లో మార్పు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరీక్షల విభాగం ఏం చేస్తున్నట్లో?

పరీక్షల నిర్వహణ, వాటికి సకాలంలో మూల్యాంకనం చేయించి, ఫలితాలు విడుదల చేయడం వర్సిటీలోని పరీక్షల విభాగం (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్) బాధ్యత. కానీ ఆంధ్ర యూనివర్సిటీ పరీక్షల విభాగం మొద్దు నిద్ర పోతున్నట్లుగా ఉంది. రంగస్థల విభాగంలో పరీక్షలు నిర్వహించి ఐదు నెలలు కావస్తున్నా ఫలితాలు విడుదల చేయాలనే ధ్యాస లేకపోవడం వారి పనితీరుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిణామాలతో ఫలితాల కోసమని రంగస్థలం కోర్సు అభ్యసించిన విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

అడ్మిషన్లు ఆలస్యం వల్లే..

రంగస్థల విభాగంలో ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ కాస్తా ఆలస్యమైంది. మూల్యాంకనం పూర్తి చేసేలా దృష్టి సారిస్తాం. కాంట్రాక్టు ఆచార్యులతో పాటు, మూల్యాంకనం కోసం రిటైర్డ్ ఆచార్యులను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఫలితాలు ప్రకటిస్తాం.

– ఆచార్య నరసింహారావు, థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతి

గ్లకోమా.. జాగ్రత్త సుమా

బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

ఏయూక్యాంపస్: ప్రజలు గ్లకోమా వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య శాల వైద్యుడు టి.సాయి యశ్వంత్ సూచించారు. ఎల్వీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు గ్లకోమా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ గ్లకోమా పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. మార్చి 8 నుంచి 16 వరకు ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్లకోమా అవగాహన వారోత్సవాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా సామాజిక మాధ్యమాలు, అవగాహన సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. గ్లకోమాను తొలి దశలో గుర్తించడానికి, మెరుగైన చికిత్సకు, అంధత్వాన్ని నివారించడానికి పలు సూచనలు చేశారు. జీఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ మాట్లాడుతూ కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉంటే తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 40 ఏళ్లు పైబడిన ప్రతి 200 మందిలో ఒకరికి గ్లకోమా వచ్చే అవకాశం ఉందన్నారు. గ్లకోమా ముదిరే వరకు లక్షణాలు కనిపించకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, తొలి దశలో గుర్తిస్తే చూపును కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ శ్రావణి కొడాలి మాట్లాడుతూ 40 ఏళ్ల లోపు వారు 2–4 ఏళ్లకోసారి, 40–60 ఏళ్ల వారు 2–3 ఏళ్లకోసారి, 60 ఏళ్లు పైబడిన వారు ప్రతి సంవత్సరం కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రపంచ గ్లకోమా సంస్థ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 7 మిలియన్ల మంది గ్లకోమా కారణంగా అంధులు అవుతున్నారు. వీరిలో 66 శాతం మంది మహిళలేనని, అవగాహన లేకపోవడం వల్ల 90 శాతం కేసులు గుర్తించలేకపోతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అవగాహన ర్యాలీలో ప్లకార్డులు పట్టుకుని 200 మందికి పైగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ బస్సు నుంచి పొగలు

• ప్రయాణికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

ఎస్.రాయవరం: విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ బస్సు నుంచి అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం, గెడ్డపాలెం వద్ద పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం విశాఖ నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. గెడ్డపాలెం కూడలి వద్దకు వచ్చేసరికి బస్సు వెనుక టైర్ డ్రమ్ములు పట్టేయడంతో పొగలు వ్యాపించాయి. వాసన గమనించిన ప్రయాణికులు డ్రైవర్‌కు చెప్పి బస్సు నిలిపివేయించారు. సమాచారం అందుకున్న నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వేరే బస్సును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు.. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. రాత్రి 10 నుంచి 12.30 గంటల వరకు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. పోలీస్ స్టేషన్‌లో ట్రావెల్స్ యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. చివరకు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు బయలుదేరారు.

ఇంటర్ మూల్యాంకనం వేళల మార్పు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనం వేళలు మార్పు చేసినట్లు ఆర్ఐవో మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రమైన ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఈనెల 17, 18 తేదీల్లో ఉదయం ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు ఉన్నందున మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కనుజు పిల్ల మృతి


హెల్త్ ఏరీనాలో మృతి చెందిన కనుజు పిల్ల

ఎంవీపీకాలనీ: కైలాసగిరిని ఆనుకుని ఉన్న హెల్త్ ఎరీనా వాకింగ్ ట్రాక్‌లో కనుజు పిల్ల మృతి చెందింది. ఆదివారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన కొందరు వాకర్స్ బుద్ధుడి విగ్రహం వద్ద కనుజు పిల్ల మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని ఎరీనా నిర్వాహకులు, వీఎంఆర్డీఏ అధికారులతో పాటు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి పరిశీలించారు. తాగు నీరు దొరక్క ఈ కనుజు మృతి చెంది ఉండవచ్చని వారు భావిస్తున్నారు. వేసవిలో వన్యప్రాణులకు నీరు అందుబాటులో ఉంచేలా కొన్ని పాయింట్లు ఏర్పాటు చేయాలని వాకర్స్ అటవీ శాఖను కోరారు.

బ్రేక్ డ్యాన్స్‌తో చైతన్య షేక్



బ్రేకింగ్ అథ్లెట్‌గా అమెరికా ఫెడరేషన్ ఇచ్చిన గుర్తింపు కార్డు


కోచ్‌తో చైతన్య

తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని కలలు కనే ఈ రోజుల్లో..
చదువుతో పాటు ఇతర కళల్లోనూ రాణించవచ్చని నిరూపిస్తున్నాడు 9వ తరగతి విద్యార్థి పెంటకోట చైతన్య. అక్కయ్యపాలేనికి చెందిన చైతన్య బ్రేక్ డ్యాన్స్‌లో అద్భుతమైన నైపుణ్యంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. చిన్న వయసు నుంచే పిల్లలను ఫౌండేషన్ కోర్సుల్లో చేర్పించి, వారి ఆసక్తులను పట్టించుకోకుండా ఆట పాటలకు దూరం చేస్తున్న ప్రస్తుత తరుణంలో చైతన్య కథ ఒక వెలుగు దివ్వె. తరగతి గది చదువులే కాదు, పిల్లలకు నచ్చిన రంగాల్లో ప్రోత్సాహం లభిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని చైతన్య తన విజయంతో చాటి చెబుతున్నాడు. అతను తన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆశిద్దాం, అభినందిద్దాం.

– సీతంపేట

ప్రపంచ స్థాయి బ్రేక్ డ్యాన్సర్‌గా రాణిస్తున్న 9వ తరగతి విద్యార్థి

దేశంలో మొదటి ర్యాంకు, వరల్డ్‌లో 122వ ర్యాంకు

ఏడేళ్ల వయసులో శిక్షణ ప్రారంభించిన పెంటకోట చైతన్య

2026 యూత్ ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ



ఏడేళ్ల వయసులోనే బ్రేక్ డ్యాన్స్ నేర్చుకోవడం మొదలుపెట్టిన చైతన్య.. గడిచిన ఏడేళ్లలో అద్భుతమైన నైపుణ్యం సంపాదించాడు. సమ్మర్ క్యాంప్ నుంచి మొదలుకొని అంతర్జాతీయ వేదికల వరకు తన ప్రతిభను చాటుకున్నాడు. గత ఏడాది చైనాలో జరిగిన వరల్డ్ యూత్ బ్రేకింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున పాల్గొని 122వ ర్యాంక్ సాధించాడు. ఈ పోటీలో 42 దేశాల నుంచి 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా, చైతన్య ఉత్తమ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 2026లో డాకర్(సెనెగల్)లో జరగనున్న యూత్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన తదుపరి లక్ష్యమని చైతన్య చెప్పాడు. ఇందుకోసం నిరంతర సాధన చేస్తున్నాడు.

ఇది ఏడేళ్ల కిందటి మాట..

వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటన వచ్చింది. ఇది చూసిన పెంటకోట రాజేష్ రెండో తరగతి చదువుతున్న తన కుమారుడు చైతన్యకు డ్యాన్స్‌లో శిక్షణ ఇప్పించేందుకు శిబిరంలో చేర్పించారు. 45 రోజుల పాటు డ్యాన్స్ మాస్టర్ సోహెయిల్ సింగ్ వద్ద చైతన్య శిక్షణ తీసుకున్నాడు. చైతన్యలోని చురుకుదనం, బాడీ లాంగ్వేజ్, పట్టుదల, క్రమశిక్షణ చూసిన సోహెయిల్ సింగ్ ఆశ్చర్యపోయాడు. ఇదే విషయాన్ని రాజేష్‌కు చెప్పాడు. దీంతో కుమారుడిని ఇదే రంగంలో ప్రోత్సహించాలని ఆ తండ్రి నిర్ణయించుకుని సోహెయిల్ సింగ్ వద్ద శిక్షణ కొనసాగించారు. గడిచిన ఏడేళ్లలో రాష్ట్ర, జాతీయ స్థాయి బీ–బాయ్స్(బ్రేక్ డ్యాన్స్) పోటీల్లో చైతన్య విజేతగా నిలుస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం ముంబయిలో టోర్నడో అనే మాస్టర్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు.

మరో రెండు అడుగుల దూరంలో..

• తన 7వ ఏట డ్యాన్స్ శిక్షణ ప్రారంభించిన చైతన్య.. కొన్ని నెలలకే ఒరిజినల్ స్ట్రీట్ డ్యాన్స్ పోటీల్లో 70 మందితో పోటీ పడి విజేతగా నిలిచాడు.
• రాష్ట్ర డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ 2022లో నిర్వహించిన ఏపీ స్టేట్ బ్రేకింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–16 విభాగంలో బంగారు పతకం సాధించాడు.
• ఐఐటీ మద్రాస్‌లో 2023 జనవరిలో నిర్వహించిన ఒరిజినల్ స్ట్రీట్ డ్యాన్స్ చాంపియన్‌షిప్ పోటీలో అండర్–16 విభాగంలో విజేతగా నిలిచాడు.
• అమెచ్యూర్ డ్యాన్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2023 డిసెంబర్‌లో నిర్వహించిన


సాధించిన పతకాలు, సర్టిఫికెట్లతో చైతన్య

3వ నేషనల్ బ్రేకింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆల్ ఇండియా 8వ ర్యాంకుతో ప్రతిభ చాటాడు.
• 2024 జూన్‌లో నిర్వహించిన నాలుగో నేషనల్ బ్రేకింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆల్ ఇండియా 8వ ర్యాంకు సాధించ ాడు.
• వరల్డ్ డ్యాన్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024 సెప్టెంబర్‌లో చైనాలో జరిగిన 5వ వరల్డ్ యూత్ బ్రేకింగ్ చాంపియన్‌షిప్ పోటీలో 122వ వరల్డ్ ర్యాంక్ సాధించి అబ్బురపరిచాడు. ఈ పోటీల్లో ఇండియా నుంచి నలుగురు పాల్గొనగా.. చైతన్య ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు.
• బ్రేక్ డ్యాన్సింగ్‌లో అథ్లెట్‌గా యూఎస్ఏ గుర్తింపు కార్డు ఇచ్చింది. ఈ గుర్తింపుతో ప్రపంచంలోని ఏ దేశంలో జరిగే పోటీల్లోనైనా చైతన్య పాల్గొనడానికి అవకాశం దక్కింది.
• 2025 నవంబర్‌లో ఇండోనేషియాలో, ఆ తర్వాత చైనాలో మరోసారి జరగనున్న పోటీల్లో ప్రతిభ చూపితే 2026 డాకర్‌లో జరిగే యూత్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున పాల్గొనే అవకాశం చైతన్యకు లభిస్తుంది.

సమ్మర్ క్యాంప్ నుంచి అంతర్జాతీయ స్థాయికి..



చైతన్య నాకు రెండవ సంతానం. మొదటి బిడ్డకంటే తొమ్మిదేళ్ల ఆలస్యంగా పుట్టాడు. సమ్మర్ క్యాంప్‌లో డ్యాన్స్‌లో మంచి ప్రతిభ చూపడంతో.. అందులోనే శిక్షణ కొనసాగించాను. ప్రతీ కదలికను ఎంతో శ్రద్ధగా నేర్చుకున్న చైతన్య భవిష్యత్‌లో మంచి డ్యాన్సర్ అవుతాడని సోహెయిల్ మాస్టర్ విశ్వసించారు. అతని నమ్మకాన్ని చైతన్య నిలబెట్టాడు. డ్యాన్స్‌తో పాటు చదువును కూడా కొనసాగిస్తున్నాడు. మద్దిపాలెంలోని శివశివాని స్కూల్ యాజమాన్యం చైతన్య చదువుకు సహకరిస్తోంది. యూత్ ఒలింపిక్స్‌లో దేశం తరఫున పాల్గొనాలన్న లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు.

– పెంటకోట రాజేష్, చైతన్య తండ్రి

ఆచార్య మలయవాసినికి సాహిత్య కళాభారతి బిరుదు


ఆచార్య మలయవాసినిని సత్కరిస్తున్న వీఎండీఏ ప్రతినిధులు ఎంఎస్ఎన్‌రాజు, రాంబాబు

మద్దిలపాలెం: ప్రముఖ ఆంధ్ర భాషా ఆచార్యులు, అభినవ మొల్ల, ఆచార్య కోలవెన్ను మలయవాసినికి సాహిత్య కళా భారతి బిరుదు ప్రదానం ఘనంగా జరిగింది. విశాఖ మ్యూజిక్, డాన్స్ అకాడమీ(వీఎండీఏ), కళాభారతి నిర్వాహక మండలి ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, ట్రస్టీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్‌లు.. విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు పిల్లా వెంకట రమణమూర్తి రాసి చదివిన సన్మాన పత్రం, నూతన వస్త్రాలు, నగదు పురస్కారంతో ఆచార్య మలయవాసిని దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శలాక రఘునాథ శర్మ మాట్లాడుతూ ఆచార్య కోలవెన్ను మలయవాసినికి సాహిత్య కళా భారతి బిరుదు ప్రదానం చేసిన సభలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సత్కార గ్రహీత ఆచార్య మలయవాసిని తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ గుమ్మలూరి ఇందిర రచించిన 'మన రాముడు'అనే పుస్తకాన్ని రఘునాథ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. డాక్టర్ పేరి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు.

నేడు ఆరోగ్య మిత్రల నిరసన

మహారాణిపేట: ఏపీ ఆరోగ్య మిత్ర, ఇతర సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం మళ్లీ ఉద్యమ బాట పట్టారు. గతంలో నిరసనలు తెలిపినా కూటమి ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం, ఈ నెల 12న జరిగిన చర్చలు విఫలం కావడంతో దశల వారీగా ఆందోళనలు చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద గల జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలపనున్నారు. ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీ వైద్య సేవ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవింద తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 27న మంగళగిరిలో ట్రస్ట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి'

మధురవాడ: అమ్మకపు విలువపై వేసే ఆస్తి పన్నును వెంటనే సమీక్షించి రద్దు చేయాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వీఏఆర్‌డబ్ల్యూఏ), గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్స్ ఫెడరేషన్ (ఎన్‌జీవీఏఎస్) నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో నెలకొన్న సమస్యలపై పరిష్కారానికి ముఖ్యమంత్రికి వినతిపత్రాలు పంపించాలని నిర్ణయించారు. బక్కన్నపాలెంలోని ఎస్‌వీఎస్ రాయల్ ప్యారడైజ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరావు, రఘురాం, నారాయణరావు తదితరులు మాట్లాడారు. అన్ని అపార్ట్‌మెంట్‌లు, అసోసియేషన్ల నుంచి ఈ వినతిపత్రాలు దశలు వారీగా పంపించాలని సమావేశంలో తీర్మానించారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు షాక్‌కు గురిచేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లు నగర ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేస్తాయని, కాబట్టి అపార్ట్‌మెంట్లలో గానీ, కాలనీ ఇళ్లల్లో గానీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుమతించరాదన్నారు. మీటర్లు బిగించడానికి వచ్చే సిబ్బందిని తిరస్కరించాలని నిర్ణయించారు. మధురవాడ రోడ్లకు మరమ్మతులు చేయాలని, కాలువలు, రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. అనేక చోట్ల వీధి లైట్లు లేవని, ఉన్నవి కూడా వెలగడం లేదన్నారు. ఈ సమస్యలపై జెడ్పీలను కలిసి విన్నవించాలని నిర్ణయించారు. ఆయా సంఘాల నాయకులు ధర్మారావు, టి.శ్రావణి, శారద, శేషగిరిరావు, బి.గోవిందరావు, రత్నాకర్, నరసింహమూర్తి, సుధీర్, గణేష్ పాల్గొన్నారు.

సాగరతీరంలో.. సరదాగా..







డాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. నగరవాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బీచ్ ప్రాంతమంతా సందడిగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణం, చల్లటి సముద్రపు గాలుల మధ్య సందర్శకులు ఉల్లాసంగా గడిపారు. అలాగే ఫిషింగ్ హార్బర్ జెట్టీ 10, 11 వద్ద మత్స్యకార కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారు సముద్రంలో ఉత్సాహంగా డైవ్‌లు చేస్తూ కేరింతలు కొట్టారు. థర్మాకోల్ షీట్లపై తేలియాడుతూ, ఒకరినొకరు నీటిలోకి లాగుతూ జలకాలాటలు ఆడారు. సాహసోపేతమైన డైవ్‌లతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

- ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆర్ట్ వర్క్ టీచర్లను రెగ్యులర్ చేయాలి


మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

కంచరపాలెం : సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో గత 14 ఏళ్లగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్ట్ వర్క్ ఎడ్యుకేషన్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, ఎంటీఎస్ వర్తింపు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్క్స్ ఆర్క్ ఇన్‌స్ట్రక్టర్స్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన నాయకులు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో రాష్ట్రంలో మొత్తం సుమారు 5,800 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ప్రస్తుతం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 460 మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఒకేషనల్ ఉపాధ్యాయులుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ భాగవతులు, విశాఖ అధ్యక్షుడు బి.రవిచంద్, జిల్లా అసోసియేషన్ చైర్మన్ త్రినాథరావు, కె.ఎస్.రావు, ఎస్ నాగరాజు, పాడి పంతులు, ఎస్.రామచంద్రరావు, వరప్రసాదరావు, పేరూరి శ్రీనివాసరావు, మెట్ట భారతి పాల్గొన్నారు.

తాటిపూడి వద్ద భూమాత సరికొత్త వెంచర్


భూమాతాస్ ఎస్‌విఎస్ స్వప్నలోక్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎండి తాళ్లూరి పూర్ణ చంద్రరావు తదితరులు

కొమ్మాది : భూమాత గ్రూప్, ఎస్‌విఎస్ గ్రూప్ సంయుక్తంగా తాటిపూడి వద్ద 200 ఎకరాల్లో భూమాతాస్ ఎస్‌విఎస్ స్వప్నలోక్ పేరుతో వెంచర్ వేస్తున్నట్లు భూమాత గ్రూప్ ఎండీ తాళ్లూరి పూర్ణచంద్రరావు తెలిపారు. బీచ్ రోడ్డులోని ఓ రిసార్ట్‌లో ఆదివారం సాయంత్రం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఎస్‌విఎస్ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 ఎకరాల్లో 5 ఫేజ్‌ల్లో.. 1650 ప్లాట్లు వీఎంఆర్‌డీఏ అనుమతులతో అందరికి అందుబాటు ధరల్లో నిర్మించినట్లు తెలిపారు. ఈ వెంచర్‌లో ఇంతవరకు రియల్‌ఎస్టేట్ చరిత్రలో ఎవరు ఇవ్వని సౌకర్యాలు, క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. థీమ్డ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్టుగా కస్టమర్లకు విశ్రాంతి, వినోదం ఇచ్చే ఇలాంటి భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు ఆంధ్రలో ఇదే మొదటిదని తెలిపారు. ఈ వెంచర్‌కు సమీపంలోని తాటిపూడి రిజర్వాయర్‌ను ప్రభుత్వం టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తుండడంతోపాటు 500 ఎకరాల్లో జిందాల్ కంపెనీ టూరిస్ట్ స్పాట్‌గా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఈ వెంచర్ మీదుగా 4 లైన్ల హైవే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్లూరి శివాజీ, కిరణ్ శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణే అసలైన దేశభక్తి

• ఆర్‌ఎస్‌ఎస్ సహప్రాంత కార్యవాహ మాలపాటి శ్రీనివాసరెడ్డి
• అట్టహాసంగా ఆర్‌ఎస్‌ఎస్ మహానగర్ సాంఘిక్
• ఘోష్ ప్రదర్శన, విన్యాసాలతో అబ్బురపరిచిన స్వయంసేవకులు


ప్రసంగిస్తున్న సహ ప్రాంత కార్యవాహ మాలపాటి శ్రీనివాస రెడ్డి

సీతమ్మధార: ఏ పని చేసినా భారతదేశం గర్వించేలా ఉండాలని, భారతీయతను ముందుకు తీసుకువెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత కార్యవాహ మాలపాటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అక్కయ్యపాలెంలోని పోర్ట్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) మహానగర్ సాంఘిక్ ఉత్సాహంగా జరిగింది. పూర్ణగణవేష్‌తో వందలాది స్వయంసేవకులు హాజరయ్యారు. ఘోష్ ప్రదర్శనతో స్వయం సేవకులు ఆకట్టుకున్నారు. పలు రకాల విన్యాసాలతో అబ్బురపరిచారు. ఈ సందర్భంగా మాలపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేధాశక్తి, నైపుణ్యానికి మనదేశం పెట్టింది పేరన్నారు. ధర్మ రక్షణ కోసం ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా పని చేస్తోందన్నారు. వ్యక్తికి దేశభక్తి, సంస్కృతి పట్ల నిష్ఠ ఉండాలని, దేశానికి పూర్వవైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణంతోనే సంఘ నిర్మాణం జరుగుతుందన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి దేశాన్ని దెబ్బతీసే వారిని ఇప్పటికీ చూస్తున్నామని.. అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలదేనన్నారు. స్వదేశీ భావన ఉపన్యాసాలతో సాధ్యం కాదని, కార్యాచరణ అవసరమన్నారు. మతం పేరుతో భూభాగాన్ని పోగొట్టుకున్నామని గుర్తుచేశారు. ప్రపంచంలోని అనేక సవాళ్లకు హిందుత్వమే సమాధానమని, మనదేశంలో ఉన్న కుటుంబ వ్యవస్థ ఒక అద్భుతమని కొనియాడారు. అమెరికా నేడు కుటుంబ వ్యవస్థను కోరుకుంటోందన్నారు. దేశంలో మళ్లీ ప్రాంతీయ భేదాలు సృష్టించి విడగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దేశంలో స్త్రీకి స్వాతంత్ర్యం లేదని సోషల్ మీడియాలో నూరిపోస్తున్నారని, స్త్రీని ప్రతి దశలోనూ కాపాడే వ్యవస్థ మనకుందన్నారు. ఒక ఆలయం మీద ఆధారపడి ఎంతో మంది జీవిస్తున్నారని, ఆలయాలు హిందూ సమాజాన్ని మేలుకొలిపే శక్తి కేంద్రాలుగా ఉన్నాయన్నారు. పర్యావరణ సమతుల్యత మన సంస్కృతిలోనే ఉందని, నదులను తల్లులుగా భావిస్తామన్నారు. రాజకీయ స్వార్థాల కోసం దేశాన్ని విచ్ఛిన్నం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రినీటీల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్టర్ నాగ వెంకట సత్యేంద్ర, మహానగర సంఘ చాలక్ పి.వి.నారాయణరావు, సహ సంఘ చాలక్ బి.సి.అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

ఆరిలోవ : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తెలిపారు. విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కళాశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) ఉత్తరాంధ్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత విధానం, సీపీఎస్ రద్దు, పాత పింఛన్ విధానం అమలు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తయినప్పటికీ ఇంతవరకు ఉపాధ్యాయుల సమస్యలు తీర్చలేదన్నారు. ఐఆర్ ప్రకటించకపోవడం, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర క్షోభకు గురవుతున్నారని తెలిపారు. సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ శాశ్వత బదిలీ చట్టంలో లోపాలను సవరించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలన్నారు. డీఎస్సీ ఖాళీలన్నింటినీ బదిలీల్లో చూపించాలని తెలిపారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తమ్మినేని ఆనందరావు, సహాయ కార్యదర్శి చిన్ని శ్రీనివాస్, ఇ.రామునాయుడు, జె.రామునాయుడు, శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ జిల్లా కార్యదర్శిగా విశ్వనాథం

విశాఖ విద్య : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీ చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఎస్.వి విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కోశాధికారిగా పద్మనాభం మండలానికి చెందిన కనకల సన్యాసినాయుడు, నగర అధ్యక్షుడిగా సుదర్శన పటా్నయక్, నగర ప్రధాన కార్యదర్శిగా దొరబాబు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటన కార్యదర్శి చిన్ని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, జిల్లా పర్యటన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా మహిళా కన్వీనర్ రామలక్ష్మి తదితరులు కమిటీ నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.